PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 272 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 26 సెప్టెంబర్ 2026

ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల సేవలు అమూల్యం




ఎయిర్‌పోర్టుకు 'రాణి రుద్రమదేవి' పేరు ప్రతిపాదన




# తెలంగాణలో 200 కొత్త కోర్టులకు ఆమోదం

**తొలి దశలో అదనపు జూనియర్ సివిల్ న్యాయస్థానాల ఏర్పాటు.. కేసుల భారాన్ని తగ్గించడమే లక్ష్యం**



**హైదరాబాద్,సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో పెరుగుతున్న కేసుల భారాన్ని తగ్గించి, ప్రజలకు స్థానికంగానే వేగంగా న్యాయ సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 200 అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి, అదనపు ప్రథమ శ్రేణి న్యాయ మేజిస్ట్రేట్ న్యాయస్థానాల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి బీ. పాపిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. **594 న్యాయస్థానాల అవసరాన్ని గుర్తించిన హైకోర్టు** రాష్ట్రంలో కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మొత్తం 594 కొత్త న్యాయస్థానాలు, వాటికి అవసరమైన సిబ్బంది, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వం స్పందించి తొలి దశగా 200 న్యాయస్థానాలకు అనుమతి మిగతా2లో...




# గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ గణనాథుడు

**ఘనంగా ఖైరతాబాద్ గణేశుని శోభాయాత్ర**
**భారీ భద్రతా వలయంలో హైదరాబాద్**
**11 రోజుల పాటు భక్తులతో విశేష పూజలందుకున్న ఖైరతాబాద్ గణనాథుడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. వినాయక నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ మహాగణపతిని కడసారి దర్శించుకునేందుకు భక్తులు అశేషంగా తరలివచ్చారు.**

**హైదరాబాద్,సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** అశేష భక్త వాహిని జయజయధ్వానాల మధ్య ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా ముగిసింది. 11 రోజుల పాటు భక్తులతో ధూపదీప నైవేద్యాలందుకున్న ఆ గణనాథుడు గంగమ్మ ఒడిని చేరుకున్నాడు. ఈ క్రతువును చూసేందుకు ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో హైదరాబాద్ నగరం జనసంద్రంగా మారింది.తొలుత బాహుబలి క్రేన్‌లో సాంకేతిక లోపంతో బడా గణేశ్ టస్కర్‌పైకి ఆలస్యంగా చేరాడు. ఉదయం 6 గంటలకు ప్రారంభం కావాల్సిన శోభాయాత్ర, క్రేన్‌లో సమస్య కారణంగా 3 గంటల ఆలస్యంగా 9 గంటలకు ప్రారంభమైంది. 'జై బోలో గణేశ్ మహారాజ్ కీ జై' అంటూ భక్తుల జయజయధ్వానాలు మిగతా2లో...


## సీబీఎస్ఈ నూతన చైర్మన్‌గా మందీప్ కే బండారి

**- కేంద్ర మాధ్యమిక విద్యా మండలి నూతన సారథిగా సీనియర్ ఐఏఎస్ అధికారి**




# ఓటు బ్యాంకు రాజకీయాలు కాదు.. సామాజిక మార్పుపై దృష్టి

**సామాజిక సంస్కరణలు, సానుకూల మార్పు కోసం పనిచేయాలి: ప్రధాని మోదీ**



**న్యూఢిల్లీ:సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఓటు బ్యాంకు రాజకీయాలపై దృష్టి పెట్టకుండా సామాజిక సంస్కరణలు, సమాజంలో సానుకూల మార్పు కోసం కృషి చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం వారణాసి నుంచి వాద్‌నగర్ వరకు కొనసాగుతున్న 'సేవా యాత్ర'లో పాల్గొంటున్న వారితో మిగతా2లో...

# రేవంత్‌రెడ్డికి ఉత్తమ ప్రజాసేవకుడి పురస్కారం

**- రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్యుల సంక్షేమ పాలనకు గుర్తింపు**




# రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలి

**ప్రధాని, హోంమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కిషన్ రెడ్డి**



**హైదరాబాద్,సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఆయన వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని శు క్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇతర పార్టీల గుర్తులపై గెలిచిన పలువురు శాసనసభ్యులను మిగతా2లో...



# 'స్టాలిన్ సార్.. నోరు విప్పండి': విజయ్

**వీరమణి వ్యవహారంపై మాజీ ముఖ్యమంత్రిని ప్రశ్నించిన తమిళగ వెట్రి కళగం అధినేత**

**చెన్నై:సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** తమిళనాడులో అధికార డీఎంకే, అన్నాడీఎంకేలపై తమిళగ వెట్రి కళగం అధినేత, ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ విమర్శలు గుప్పించారు. మదురాంతకం శాసనసభ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన సభలో ఆయన డీఎంకేను తీవ్రంగా విమర్శిస్తూ, రెండు ద్రవిడ పార్టీల మధ్య రాజకీయ అవగాహన ఉందని ఆరోపించారు.గ్రానైట్ వ్యాపారి మిగతా2లో...

# గ్రామీణ తెలంగాణకు శాశ్వత వసతులే లక్ష్యం

**- తొలి దశలో 7,448 కి.మీ. రహదారుల అభివృద్ధి.. దసరా నాటికి పనులు ప్రారంభించాలి: మంత్రి సీతక్క**



**హైదరాబాద్,సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామీణ తెలంగాణలో శాశ్వత మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. వరంగల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామీణ రహదారుల అభివృద్ధిలో హైబ్రిడ్ వార్షిక చెల్లింపు విధానం కీలకంగా నిలవాలని ఆకాంక్షించారు. తొలి దశలో 7,448 కిలోమీటర్ల మేర రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. దసరా నాటికి అన్ని ప్యాకేజీల్లో పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఆవాసం నుంచి రాష్ట్ర రాజధానికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యమన్నారు.వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నీటి భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీతక్క సూచించారు. ప్రతి జలాశయంలో నీటి మట్టాలను ప్రతిరోజూ పర్యవేక్షించి, ఏడాది తాగునీటి అవసరాలను ముందుగానే నిర్ధారించాలని అన్నారు. మిషన్ భగీరథలో సమస్యలు ఉన్న 86 జనావాసాల్లో నీటి సరఫరాను అత్యవసరంగా పునరుద్ధరించాలని ఆదేశించారు.ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి గ్రామానికి ఊటకుంట ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. "కూలీకి పని.. మిగతా2లో...

# బ్రహ్మోస్‌తో పాక్‌కు నిద్రలేని రాత్రులు

**- లఖ్నవూలో తయారవుతున్న క్షిపణితో శత్రువులకు భయం: అమిత్ షా**



**లఖ్నవూ:సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** లఖ్నవూలో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణితో పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు వచ్చాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. అమేఠీలో తయారవుతున్న ఏకే203 తుపాకులతో నక్సలైట్లు, ఉగ్రవాదులకు కూడా కంటిమీద కునుకు లేకుండా మిగతా2లో...

# తెలంగాణలో 200 కొత్త కోర్టులకు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చింది. కొత్త న్యాయస్థానాల ఏర్పాటుతో కేసుల విచారణకు అదనపు సామర్థ్యం ఏర్పడటంతో పాటు న్యాయం కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు స్థానిక స్థాయిలోనే సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. **రంగారెడ్డికి అత్యధికంగా 30 న్యాయస్థానాలు** కొత్త న్యాయస్థానాల కేటాయింపులో రంగారెడ్డి జిల్లాకు అత్యధికంగా 30 కేటాయించారు. రాజేంద్రనగర్, ఎల్‌బీనగర్, కూకట్‌పల్లి, హయత్‌నగర్, చేవెళ్ల, షాద్‌నగర్, ఆమనగల్, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో ఇవి ఏర్పాటు కానున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు 25, హైదరాబాద్ నగర పరిధిలోని సిటీ సివిల్, సెషన్స్ న్యాయస్థానాల పరిధికి 16 న్యాయస్థానాలు కేటాయించారు.

ఇతర జిల్లాల్లో నల్గొండకు 10, ఖమ్మం, సంగారెడ్డికి 8 చొప్పున, కరీంనగర్, సూర్యాపేటకు 7 చొప్పున, నిజామాబాద్, జగిత్యాలకు 6 చొప్పున, సిద్దిపేట, మంచిర్యాలకు 5 చొప్పున న్యాయస్థానాలు మంజూరయ్యాయి. వరంగల్, హనుమకొండ జిల్లాలకు కలిపి 12 న్యాయస్థానాలు కేటాయించారు. **ప్రజలకు వేగవంతమైన న్యాయ సేవలపై ఆశలు** కొత్త న్యాయస్థానాల ఏర్పాటు ద్వారా ఇప్పటికే ఉన్న న్యాయస్థానాలపై కేసుల భారం కొంత మేర తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్న, సాధారణ స్వభావం గల కేసుల విచారణకు అదనపు న్యాయస్థానాలు అందుబాటులోకి రావడం వల్ల విచారణ ప్రక్రియ మరింత సులభతరం కానుంది. అయితే న్యాయస్థానాల పూర్తి స్థాయి కార్యకలాపాలకు అవసరమైన న్యాయమూర్తులు, సిబ్బంది, భవనాలు, ఇతర మౌలిక వసతుల ఏర్పాటు కూడా కీలకం కానుంది.

# రేవంత్‌రెడ్డికి ఉత్తమ ప్రజాసేవకుడి పురస్కారం

**హైదరాబాద్,సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి కేరళకు చెందిన ఆర్యదాన్ మహమ్మద్ ఫౌండేషన్ ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ మహమ్మద్2026 ఉత్తమ ప్రజాసేవకుడి పురస్కారం' అందజేసింది. కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్ చేతుల మీదుగా ముఖ్యమంత్రి పురస్కారాన్ని స్వీకరించారు. ఈ పురస్కారం కింద రూ.లక్ష నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందించారు. **సంక్షేమ కార్యక్రమాలకు గుర్తింపు** తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, దూరదృష్టితో కూడిన నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని రేవంత్‌రెడ్డిని పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ శాసనసభ్యుడు ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. ప్రజాస్వామిక విలువల పట్ల ముఖ్యమంత్రి చూపుతున్న నిబద్ధతను ఎంపిక కమిటీ ప్రత్యేకంగా ప్రశంసించినట్లు వెల్లడించారు. **ముగ్గురితో కూడిన ఎంపిక కమిటీ** పురస్కార ఎంపిక కమిటీలో పార్లమెంట్ సభ్యుడు బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మంత్రి ఏ.పీ. అనిల్‌కుమార్, ప్రముఖ మేధావి కల్పెట్ట నారాయణన్ ఉన్నారు. ఈ కమిటీ పరిశీలన అనంతరం రేవంత్‌రెడ్డిని పురస్కారానికి ఎంపిక చేసింది.

కేరళకు చెందిన ఈ పురస్కారాన్ని తొలిసారిగా కేరళ వెలుపలికి చెందిన వ్యక్తికి అందిస్తున్నట్లు కార్యక్రమంలో పేర్కొన్నారు. **ఆర్యదాన్ మహమ్మద్ స్మారకార్థం** కేరళకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి ఆర్యదాన్ మహమ్మద్ స్మారకార్థం ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేశారు. ఆయన ఎనిమిదిసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికై, నాలుగు వేర్వేరు మంత్రివర్గాల్లో మంత్రిగా పనిచేశారు. ప్రజా సంక్షేమం, లౌకిక విలువలు, ప్రజాస్వామిక విధానాల పట్ల ఆయనకున్న నిబద్ధతకు గుర్తింపుగా ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని కొనసాగిస్తోంది. ఆర్యదాన్ మహమ్మద్ నాలుగో వర్ధంతి సందర్భంగా నిలంబూర్‌లో ఈ అవార్డు ప్రదాన కార్యక్రమం నిర్వహించారు.

**వేడుకలో రేవంత్‌రెడ్డి ప్రసంగం** పురస్కారం స్వీకరించిన అనంతరం రేవంత్‌రెడ్డి ఆర్యదాన్ మహమ్మద్ ప్రజా జీవితాన్ని స్మరించుకున్నారు. కేరళలో లౌకిక విలువలు, ప్రజాస్వామ్య భావాలకు ఉన్న ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు. పురస్కారాన్ని తన వ్యక్తిగత గౌరవంగా కాకుండా కాంగ్రెస్ కార్యకర్తగా అందుకుంటున్న గుర్తింపుగా పేర్కొన్నారు. కే.సీ. వేణుగోపాల్ ఆర్యదాన్ మహమ్మద్ స్మారక ఉపన్యాసం చేశారు.

# చైనాలో చదువుకోండి.. అమెరికా యువతకు జిన్‌పింగ్ ఆహ్వానం

### ఐదేళ్లలో లక్ష మంది యువతను ఆహ్వానిస్తాం.. విద్య, సాంస్కృతిక మార్పిడితో సంబంధాలు బలోపేతం



**వాషింగ్టన్,సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** చైనాఅమెరికా సంబంధాలను ప్రజల స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కీలక ప్రతిపాదన చేశారు. వచ్చే ఐదేళ్లలో లక్ష మంది అమెరికా యువతను చైనాకు ఆహ్వానించనున్నట్లు ఆయన ప్రకటించారు. విద్య, పర్యటనలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఈ అవకాశాలను కల్పించనున్నట్లు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి వాషింగ్టన్‌లో చేసిన సంయుక్త ప్రకటనలో జిన్‌పింగ్ ఈ విషయాన్ని వెల్లడించారు.

**ఇప్పటికే 50 వేల మంది లక్ష్యం పూర్తి** 2023లో తాను ప్రకటించిన 50 వేల మంది అమెరికా యువతను చైనాకు ఆహ్వానించాలన్న లక్ష్యం నిర్ణీత గడువుకు ముందుగానే పూర్తయిందని జిన్‌పింగ్ తెలిపారు. దీనికి కొనసాగింపుగా మరో ఐదేళ్లలో లక్ష మంది యువతను విద్యా, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాల కోసం ఆహ్వానించనున్నట్లు చెప్పారు. ఇరుదేశాల మధ్య పరస్పర అవగాహన పెరగడానికి యువత మార్పిడి కార్యక్రమాలు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. చైనాఅమెరికా సంబంధాల భవిష్యత్తు ఇరు దేశాల ప్రజలపై, ముఖ్యంగా యువతపై ఆధారపడి ఉందని జిన్‌పింగ్ అన్నారు. ప్రజల మధ్య స్నేహం బలపడితే రెండు దేశాల మధ్య సంబంధాలకు మరింత స్థిరమైన పునాది ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. **చారిత్రక సంబంధాలను గుర్తుచేసిన జిన్‌పింగ్** రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా చైనా, అమెరికా ప్రజలు కలిసి పోరాడిన విషయాన్ని జిన్‌పింగ్ ప్రస్తావించారు. ఆ చారిత్రక సహకారాన్ని ఇరు దేశాల ప్రజలు గుర్తుంచుకున్నారని చెప్పారు. చైనా తన జాతీయ పునరుజ్జీవన లక్ష్యాలను సాధించడం, అమెరికా తన దేశాన్ని మరింత బలోపేతం చేసుకోవడం రెండూ పరస్పర విరుద్ధమైన లక్ష్యాలు కావని పేర్కొన్నారు. ఇరు దేశాలు ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని సహకారాన్ని పెంచుకోవాలని, ప్రజల మధ్య స్నేహాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతి, సుస్థిరతకు ఇరు దేశాల మధ్య స్థిరమైన సంబంధాలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. **ఉమ్మడి ప్రయోజనాలపై ట్రంప్ దృష్టి** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఇరు దేశాల మధ్య ఉమ్మడి ప్రయోజనాలపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్‌కు వ్యతిరేకంగా చైనాకు అమెరికా అందించిన సహాయాన్ని గుర్తుచేశారు. భద్రత, సాంకేతికత, కృత్రిమ మేధస్సు వంటి కీలక రంగాల్లో ఇరుదేశాల నాయకులు తీసుకునే నిర్ణయాలు భవిష్యత్ దశాబ్దాల్లో శాంతి, సౌభాగ్యంపై ప్రభావం చూపగలవని అన్నారు. ప్రస్తుతం వాణిజ్యం, సాంకేతికత, భద్రత వంటి అంశాల్లో అమెరికాచైనా మధ్య విభేదాలు కొనసాగుతున్నప్పటికీ, తాజా భేటీలో ఇరు దేశాల మధ్య సంభాషణ, సహకారం కొనసాగించాలనే అంశానికి ప్రాధాన్యం లభించింది. **యువత మార్పిడికి ప్రాధాన్యం** జిన్‌పింగ్ ప్రకటించిన లక్ష మంది యువత ఆహ్వానం ఇరు దేశాల మధ్య విద్యా, సాంస్కృతిక సంబంధాలను ప్రజల స్థాయిలో విస్తరించే ప్రతిపాదనగా నిలిచింది. ప్రభుత్వాల మధ్య చర్చలతో పాటు విద్యార్థులు, యువత, విద్యా సంస్థలు, సాంస్కృతిక వర్గాల మధ్య ప్రత్యక్ష సంబంధాలను పెంచడం ద్వారా పరస్పర అవగాహనను మెరుగుపరచాలన్న ఉద్దేశం ఇందులో కనిపిస్తోంది. తాజా అమెరికా పర్యటనలో జిన్‌పింగ్, ట్రంప్ ద్వైపాక్షిక సంబంధాల భవిష్యత్తుపై చర్చలు జరిపిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది.

# ఐక్యత చాటిన తెలంగాణ.. ప్రశాంతంగా గణేష్ నిమజ్జనాలు

### రాష్ట్రవ్యాప్తంగా 88 వేల విగ్రహాల నిమజ్జనం.. హైదరాబాద్‌లో 25 వేల మందికిపైగా పోలీసులతో బందోబస్తు

**హైదరాబాద్,సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో గణేష్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. ప్రజలు సంయమనం, సహకారంతో ఉత్సవాలను నిర్వహిస్తూ రాష్ట్ర ఐక్యతను చాటారని పేర్కొన్నారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిమజ్జన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ఇప్పటివరకు పూర్తయిన నిమజ్జనాల వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా గణేష్ ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన విగ్రహాల్లో 1.24 లక్షలు అధికారిక పోర్టల్‌లో నమోదయ్యాయని డీజీపీ తెలిపారు. గతేడాది నమోదైన సంఖ్యతో పోలిస్తే ఈసారి పెరుగుదల నమోదైందన్నా రు. ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను కలిపితే రాష్ట్రవ్యాప్తంగా మొత్తం సంఖ్య 3.5 నుంచి 4 లక్షల వరకు ఉండే అవకాశం ఉందని వివరించారు. శుక్రవారం ఉదయం వరకు సుమారు 88 వేల విగ్రహాల నిమజ్జనం పూర్తయిందని, మిగిలిన విగ్రహాల నిమజ్జనం శనివారం ఉదయానికి పూర్తయ్యే అవకాశం ఉందని తెలిపారు. **భారీ బందోబస్తు.. సమన్వయంతో ఏర్పాట్లు** హైదరాబాద్‌లో నిమజ్జనోత్సవాల కోసం గత పది రోజులుగా 25 వేల మందికిపైగా పోలీసు సిబ్బందిని బందోబస్తులో వినియోగించినట్లు డీజీపీ తెలిపారు. రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, భద్రత కోసం పోలీసు శాఖతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేశాయని చెప్పారు. నిమజ్జన మార్గాలు, వంతెనలు, రహదారులను ముందుగానే పరిశీలించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.




**శోభాయాత్రలకు కొంత ఆలస్యం** శుక్రవారం కావడంతో మతపరమైన అంశాలను గౌరవిస్తూ హైదరాబాద్‌లో కొన్ని శోభాయాత్రలు మధ్యాహ్నం కొంత ఆలస్యంగా ప్రారంభమయ్యాయని ఆనంద్ వివరించారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో నిమజ్జన ప్రక్రియ కూడా ఆలస్యంగా కొనసాగుతోందన్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో భారీ సంఖ్యలో విగ్రహాలు ఒకేసారి నిమజ్జనానికి తరలివస్తుండటంతో సమయం పడుతోందని తెలిపారు. అయినప్పటికీ ప్రజలు, ఉత్సవ కమిటీలు, పోలీసులు పరస్పరం సహకరించుకో వడంతో నిమజ్జనాలు ప్రశాంతంగా కొనసాగుతు న్నాయని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాల ప్రారంభం నుంచే భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టిన పోలీసు శాఖ.. విగ్రహాల వివరాలను నమోదు చేయ డం, నిమజ్జన మార్గాలను ముందస్తుగా గుర్తించడం, రద్దీ ప్రాంతాలను పర్యవేక్షించడం వంటి చర్యలు చేపట్టింది.

# గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ గణనాథుడు

(మొదటి పేజీ తరువాయి)

మార్మోగాయి. అశేష భక్తజనావళి నినాదాల మధ్య ఆ గణనాథుడు గంగమ్మ ఒడిని చేరాడుబడా గణేశ్ శోభాయాత్ర ఆద్యంతం కన్నుల పండువగా సాగింది. భక్తుల కోలాహలం మధ్య సంప్రదాయ మేళతాళాలతో ఖైరతాబాద్ గణేశుడి శోభాయాత్ర ట్యాంక్‌బండ్ క్రేన్ 4 వద్దకు చేరుకుంది. భక్తులు గణనాథుడిపైకి పుష్పాలు చల్లుతూ, డోలు వాయిస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. ఆ గణనాథుని కడసారి చూసేందుకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. దారి పొడవునా జై బోలో గణేశ్ మహరాజ్ కీ అంటూ నీరాజనాలు పలికారు. సెన్సేషన్ థియేటర్, టెలిఫోన్ భవన్, తెలుగు తల్లి ఫ్లైఓవర్ పక్క నుంచి సచివాలయం మీదుగా సాగర తీరానికి గణేశుడు చేరుకున్నాడు. నిమజ్జనాల సందర్భంగా హైదరాబాద్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.గణేశ్ నిమజ్జనాల సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు చర్యలు చేపట్టారు. నగరాన్ని భారీ భద్రతా వలయంలోకి తీసుకొచ్చారు. 20 వేల మందికి పైగా సిబ్బందితో పాటు కేంద్ర బలగాలను రంగంలోకి దించారు. ఇక మహా నిమజ్జన శోభాయాత్రను క్షణక్షణం పర్యవేక్షించేందుకు హైదరాబాద్ సిటీ పోలీస్ అత్యాధునిక సాంకేతికతను వినియోగించింది. 10 వేల సీసీ కెమెరాలు, 24 డ్రోన్లు, హైరైజ్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసింది.

# సీబీఎస్ఈ నూతన చైర్మన్‌గా మందీప్ కే బండారి

**న్యూఢిల్లీ:సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర మాధ్యమిక విద్యా మండలి నూతన చైర్మన్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి మందీప్ కే బండారి నియమితులయ్యారు. ఆయన నియామకానికి కేబినెట్ నియామకాల కమిటీ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఇటీవల పరీక్షల నిర్వహణ, తెరపై మార్కుల నమోదుకు సంబంధించి విమర్శలు ఎదుర్కొన్న కేంద్ర మాధ్యమిక విద్యా మండలికి ఆయన సారథ్యం వహించనున్నారు.మందీప్ కే బండారి 2001 బ్యాచ్‌కు చెందిన అగ్ముట్ కేడర్ ఐఏఎస్ అధికారి. వైద్య విద్యలో పట్టా పొందిన ఆయన ఎంబీబీఎస్‌లో స్వర్ణ పతకం సాధించారు. రెండు దశాబ్దాలకు పైగా పరిపాలనా రంగంలో సేవలందించిన ఆయన, ఇకపై విద్యా వ్యవస్థలో సంస్కరణలు, పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై దృష్టి సారించనున్నారు. చైర్మన్ పదవిని తాత్కాలికంగా అదనపు కార్యదర్శి స్థాయికి మార్చడంతో ఆయనకు అదే స్థాయి వేతన, భత్యాలు వర్తించనున్నాయి.

# ఓటు బ్యాంకు రాజకీయాలు కాదు.. సామాజిక మార్పుపై దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

దృశ్య మాధ్యమం ద్వారా మాట్లాడారు.గత 12 ఏళ్లలో నగరాలు, గ్రామాల మధ్య అంతరం గణనీయంగా తగ్గిందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడ్డాయని మోదీ పేర్కొన్నారు. మహిళల స్వావలంబన కూడా పెరిగిందన్నారు. మహాత్మా గాంధీ స్వాతంత్ర్య పోరాటంతో పాటు సామాజిక సంస్కరణల కోసం కృషి చేశారని గుర్తుచేశారు.ప్రయాగ్‌రాజ్‌లో పారిశుద్ధ్య పనులు చేపట్టిన వారి సేవలను ప్రధాని ప్రశంసించారు. వారి కృషితో కుంభమేళాకు పారిశుద్ధ్య నిర్వహణలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు. సమాజానికి సేవ చేసేవారికి తగిన గౌరవం దక్కాలని, సేవా యాత్ర తన జీవితంలో ఎంతో ప్రాధాన్యమైనదని మోదీ పేర్కొన్నారు.

# 'స్టాలిన్ సార్.. నోరు విప్పండి': విజయ్

(మొదటి పేజీ తరువాయి)

ఆర్. వీరమణికి సంబంధించిన బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం కేసును విజయ్ ప్రస్తావించారు. గత డీఎంకే ప్రభుత్వ హయాంలోనే కేసు నమోదైనప్పటికీ దర్యాప్తు తీరుపై ప్రశ్నలు తలెత్తాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను ఉద్దేశించి 'స్టాలిన్ సార్.. నోరు విప్పండి' అని ప్రశ్నించారు.కేసులో పోలీసులు తొలుత దర్యాప్తు ముగించేందుకు నివేదిక సమర్పించగా, ప్రత్యేక న్యాయస్థానం దానిని తిరస్కరించి తదుపరి దర్యాప్తుకు ఆదేశించింది. అనంతరం వీరమణితో పాటు మరికొందరిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే, గత ప్రభుత్వం ఎవరినీ కాపాడేందుకు ప్రయత్నించలేదని స్టాలిన్ స్పష్టం చేశారు. తన ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణలు అసత్యమైనవని ఆయన పేర్కొన్నారు.

# బ్రహ్మోస్‌తో పాక్‌కు నిద్రలేని రాత్రులు

(మొదటి పేజీ తరువాయి)

పోయిందని పేర్కొన్నారు. గ్రేటర్ నోయిడాలో ఉత్తరప్రదేశ్ వాణిజ్య ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు.ఉత్తరప్రదేశ్ రక్షణ పారిశ్రామిక మార్గంలో ఝూన్సీ, చిత్రకూట్, లఖ్నవూ, ఆగ్రా, అలీగఢ్, కాన్పూర్ ప్రాంతాల్లో పెట్టుబడులు వస్తున్నాయని అమిత్ షా తెలిపారు. అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ భారత్ ఆర్థికంగా పురోగమిస్తోందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో వివిధ దేశాలతో పలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదిరాయని పేర్కొన్నారు.

# రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు.
దానం నాగేందర్ విషయంలో సుప్రీంకోర్టు అనర్హత వేటు నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ అంశాలపై రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# గ్రామీణ తెలంగాణకు శాశ్వత వసతులే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

గ్రామానికి శాశ్వత ఆస్తి" అనే లక్ష్యంతో ఉపాధి పనులు చేపట్టాలని తెలిపారు.
అక్టోబర్ 2న జరిగే గ్రామసభల్లో వచ్చే ఏడాది చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ప్రజలతో చర్చించి ఆమోదించాలని అధికారులకు సూచించారు.

# హైదరాబాద్‌లో రాపిడో ఫుడ్ డెలివరీ సేవలు




**హైదరాబాద్,సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** బెంగళూరు తర్వాత రాపిడో సంస్థ తన ఓన్లీ ఫుడ్ డెలివరీ సేవలను హైదరాబాద్‌లోకి విస్తరించింది. ఇది జీరో కమిషన్ మోడల్‌పై పని చేస్తోంది. దీని సహ వ్యవస్థాపకుడు అరవింద్ శంకర్ మాట్లాడుతూ, హైదరాబాద్ గొప్ప ఫుడ్ నగరమని, కస్టమర్లకు నిజమైన ధరలకే ఆహారం అందిస్తామని తెలిపారు. ఈ యాప్ ద్వారా రెస్టారెంట్లకు ఎలాంటి కమిషన్ భారం ఉండదని, ప్రస్తుతం ఇది 20 వేలకు పైగా రెస్టారెంట్లతో భాగస్వామ్యం కలిగి ఉందని కంపెనీ వెల్లడించింది.

# ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల సేవలు అమూల్యం: గుంటుపల్లి శ్రీనివాస్ రావు

### ఖమ్మంలో ఘనంగా అంతర్జాతీయ ఫార్మసిస్ట్ దినోత్సవం ఫార్మసిస్టులకు ఘన సన్మానం





**ఖమ్మం,ప్రతినిధి సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల సేవలు ఎంతో కీలకమని టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖమ్మంలో ప్రభుత్వ ఆయుష్ వైద్యశాలల్లో సేవలందిస్తున్న ఫార్మసిస్టులను ఘనంగా సన్మానించారు.టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ జెడ్.ఎస్. జయపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ఫార్మసిస్ట్ జి. వీరయ్య, ప్రభుత్వ హోమియో వైద్యశాల ఫార్మసిస్ట్ జయశ్రీ, ప్రభుత్వ యునాని వైద్యశాల ఫార్మసిస్ట్ సూర్యకళతో పాటు ఇటీవల పదవీ విరమణ పొందిన ఆయుష్ ఫార్మసిస్ట్ ప్రకాష్‌ను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వైద్యులతో సమన్వయంతో పనిచేస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఫార్మసిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మందుల నాణ్యత, నిల్వ, పంపిణీతో పాటు రోగులకు మందుల వినియోగంపై అవగాహన కల్పించడంలో ఫార్మసిస్టుల సేవలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యానికి నిరంతరం సేవలందిస్తున్న ఫార్మసిస్టుల కృషి అభినందనీయమని అన్నారు.అనంతరం అంతర్జాతీయ ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా ఫార్మసిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయుష్ ఫార్మసిస్టు సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. ప్రకాష్ రావు, ఆయుష్ ఫార్మసిస్ట్ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు గంగిశెట్టి వీరయ్య, జిల్లా ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఉపేందర్, యునాని వైద్యాధికారి డాక్టర్ సుధాకర్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# రాయపర్తి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం



**నడికూడ,సెప్టెంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):**నడికూడ మండలంలోని రాయపర్తి సెక్టార్ పరిధిలోని రాయపర్తి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు సూపర్‌వైజర్ కె. శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాయపర్తి గ్రామ సర్పంచ్ తంగేళ్ల రాజా జగత్ ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు వంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని నిత్యం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే పోషణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్నారులకు ప్యాకెట్ ఫుడ్, కూల్‌డ్రింక్స్ వంటి వాటికి బదులుగా ఇంట్లోనే తయారు చేసిన పోషక విలువలున్న ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. సమతుల్యమైన పోషకాహారం తీసుకోవడం ద్వారా చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలను మెరుగుపరచవచ్చన్నారు. మనకు అందుబాటులో ఉన్న ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని అర్హులైన వారికి తప్పనిసరిగా అందించి, చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా పోషణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామ బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. సుజాత, సూపర్‌వైజర్ హరీష్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సంధ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం..

### ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా పల్లెలను తీర్చిదిద్దాలి

### ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత: మంత్రి సీతక్క





**మల్లంపల్లి 25 సెప్టెంబర్ (పిసిడబ్ల్యూ న్యూస్):** పల్లెలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు.శుక్రవారం మల్లంపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘స్వచ్ఛత హి సేవ’ కార్యక్రమంలో మంత్రి అనసూయ సీతక్క, రూరల్ డెవలమెంట్ ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మి ఐ ఫ్ ఎస్ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలన, మొక్కల పెంపకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. ‘స్వచ్ఛత హి సేవ’ పక్షోత్సవాల్లో భాగంగా చేపట్టిన ‘ఏక్ పేడ్ మా కే నామ్’ కార్యక్రమంలో మంత్రి సీతక్క మొక్కను నాటారు. పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత అంశాలపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.నిత్యం గ్రామాల పరిశుభ్రత కోసం సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులను మంత్రి ఘనంగా సన్మానించారు. కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనె, మాస్కులు, గ్లౌజులతో కూడిన పీపీఈ కిట్లను పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ అడవులు, పచ్చదనం కారణంగానే ములుగు జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. ప్రకృతే మానవాళికి, జీవరాశులకు జీవనాధారమని పేర్కొన్నారు. స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్‌ను పూర్తిగా దూరం చేయాలని పిలుపునిచ్చారు.**పరిశుభ్రతను పాటిద్దాం.. పచ్చదనాన్ని పెంచుదాం..** ఆరోగ్యాన్ని కాపాడుకుందామని మంత్రి పేర్కొన్నారు. ‘స్వచ్ఛత హి సేవ’ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా విజయవంతం చేయాలని కోరారు.మహిళా సంఘాల సభ్యులతో పాటు ప్రజలంతా శ్రమదాన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని మంత్రి సూచించారు. శారీరక శ్రమతోనే ఆరోగ్యంగా, దృఢంగా ఉండగలమని తెలిపారు. ఎండ, వాన, చలిని తట్టుకుంటూ కష్టపడే తత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని, ప్రకృతితో మమేకమై జీవించాలని సూచించారు.విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. మంచి విద్యార్థులుగా ఎదిగి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టర్ సురేష్ బాబు,అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డి పి ఓ వెంకయ్య, డి ఆర్ డి ఓ రవీందర్, యం పి ఓ రహీం, ఏ పి డి, స్వచ్ఛ భారత్ మిషన్ డిస్టిక్ కో ఆర్డినేటర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిర్‌పోర్టుకు ‘రాణి రుద్రమదేవి‘ పేరు ప్రతిపాదన

**- సామాజిక న్యాయవేదిక నాయకుడు అచ్చ వినోద్ కుమార్‌కు ఘన సన్మానం**



**వరంగల్ సిటీ, సెప్టెంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ మామునూర్ ఎయిర్‌పోర్టుకు కాకతీయ వీరనారి ‘రాణి రుద్రమదేవి‘ పేరును ప్రతిపాదించడం వరంగల్ జిల్లా ప్రజల, కాకతీయ సామ్రాజ్య ప్రేమికుల ఘన విజయమని సామాజిక న్యాయవేదిక వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడు అచ్చ వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టుకు రుద్రమదేవి పేరును నామకరణం చేయాలని కోరుతూ సామాజిక న్యాయవేదిక తరఫున పత్రికల ద్వారా, సోషల్ మీడియా వేదికగా, అలాగే జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాల ద్వారా వినోద్ కుమార్ పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.ఈ వినతులపై సానుకూలంగా స్పందించి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రాణి రుద్రమదేవి పేరును సూచించడం పట్ల జిల్లాలోని అన్ని కుల సంఘాలు, ప్రజలు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయవేదిక ప్రతినిధులు, కార్యకర్తలు స్థానిక చాణక్య విద్యానికేతన్‌లో అచ్చ వినోద్ కుమార్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాట్లాడిన అచ్చ వినోద్ కుమార్.. తెలంగాణ చారిత్రక వారసత్వాన్ని, కాకతీయుల వైభవాన్ని గౌరవిస్తూ ఈ నిర్ణయం దిశగా అడుగులు వేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ వేడుకలో సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎషబోయిన సాంబయ్య, రాష్ట్ర సలహాదారుడు కొమ్మినేని భూపాలరావు, జిల్లా ట్రెజరర్ సుధీర్, నాయకులు ప్రవీణ్, రహమత్, శ్వేత, అన్వర్జః, ఇర్ఫాన్, సుప్రియ తదితరులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

# కమలాపూర్‌లో ఎస్ఆర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు రైతులకు వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం





### రైతులకు భాగస్వామ్య గ్రామీణ పరిశీలన అవగాహన కల్పించిన విద్యార్థులు.

### నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం గురించి వివరణ..

**కమలాపూర్ సెప్టెంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో హనుమకొండ ఎస్ ఆర్ యూనివర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థులు భాగస్వామ్య గ్రామీణ పరిశీలన (ఆర్ పి ఏ) కార్యక్రమం నిర్వహించి రైతులకు వ్యవసాయం ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించారు.రైతుల సహకారంతో యూనివర్సిటీ విద్యార్థులు సోషల్ మ్యాప్,రిసోర్స్ మ్యాప్, సీజనల్ క్యాలెండర్,ప్రాబ్లమ్ ట్రీ, టైమ్ లైన్,పై చార్ట్,మొబిలిటీ మ్యాప్ ల ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై వివరించారు.కమలాపూర్ గ్రామానికి చెందిన సామాజిక పటం వేసి ఆరోగ్య కేంద్రం పంచాయతీ భవనం పాఠశాలలు కాలేజీలు గృహాలు,మౌలిక సదుపాయాలు గురించి సమగ్రంగా వివరించారు. గ్రామంలో ఉన్న సహజ వనరు లు చెరువులు బావులు నేల రకాలు పంట పొలాలు గుర్తించారు. గ్రామంలో ఉండే ప్రధాన పంటలు వాతావరణ మార్పులు వ్యవసాయ కూలీల లభ్యత, ప్రణాళికను రూపొందించారు.రైతులకు ప్రధాన సమస్య పంటల పై వచ్చే వ్యాధుల వల్ల పంట దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. వాటి నివారణకు చేపట్టే చర్యలను తెలియజేశారు. గ్రామస్తుల జీవనోపాధి వ్యవసాయం పశుపోషణ రైతుల ఆదాయం ఖర్చులు సాగు విస్తరణ గురించి చార్ట్ ద్వారా అవగాహన కల్పించారు.ప్రస్తుత వ్యవసాయ ఆధునిక టెక్నాలజీ పద్ధతుల గురించి రైతులకు వివరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ ఆర్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డీన్ డాక్టర్ జి భూపాల్ రాజ్, కమలాపూర్ వ్యవసాయ అధికారి వేణు,ఏ ఈ ఓ రహీం, ఆర్ఎడబ్ల్యూఈపి కోఆర్డినేటర్ టి సాయి కృష్ణారెడ్డి,గ్రామ కోఆర్డినేటర్లు డాక్టర్ శరణబసవ్ హుడెడ్,డాక్టర్ అశోక్, విద్యార్థులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికలకు చట్టాలపై అవగాహన

**- బాల్యవివాహాలు, పోక్సో, సైబర్ నేరాలపై న్యాయ విజ్ఞాన సదస్సు**




**ములుగు, సెప్టెంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ములుగు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కె.చండీశ్వరి దేవి బాల్యవివాహాల నిరోధక చట్టం, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, బాల కార్మికుల నిషేధ చట్టం, ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, సమస్యలు ఎదురైనప్పుడు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.అనంతరం విద్యార్థులకు అందుతున్న భోజన సౌకర్యాలు, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ జి.జె.వి.లక్ష్మి, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం రమణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోషణ మాసంపై అవగాహన కార్యక్రమం




**ములుగు, సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** పోషణ మాసం కార్యక్రమాల్లో భాగంగా ములుగులోని కృష్ణా కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కావ్య మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని, పోషక స్థితిని మెరుగుపరుచుకోవచ్చని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, బాలల సహాయ విభాగం సిబ్బంది, జిల్లా మహిళా సాధికారత విభాగం సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# విలేకరిని పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**కల్లూరు, సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఓ ప్రముఖ దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్న కల్లూరు పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ గంగుల గోపి నీ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. ఆయన ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. గోపి ఇటీవల తన కుడికాలి కి హైదరాబాదులో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన గృహానికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో నాయకులు లక్కినేని కృష్ణ, కాటేపల్లి కిరణ్, పెద్ద బోయిన శ్రీను, ఏనుగు సత్యం బాబు, పాపబత్తినీ నగేష్, బైర్ల కాంతారావు, తురాబల్లి, తోట సుబ్బారావు, ఆల్లకుంట నరసింహారావు, భరత్, కుంచాల వీరయ్య, పుల్లా చారి తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రథమ స్థానం

- కల్లూరు బాలికకు రూ.లక్ష ఉపకార వేతనం
- గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా అందజేత




**కల్లూరు, సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** కల్లూరు బాలికల ఉన్నత పాఠశాలలో 202526 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసి, సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రథమ స్థానం సాధించిన ఆర్. శివనందినికి రూ.లక్ష ఉపకార వేతనం లభించింది. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో గురువారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా శివనందిని ఈ ఉపకార వేతనాన్ని అందుకుంది.పదో తరగతిలో ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించినందుకు ఈ ఉపకార వేతనం అందజేశారు. ఈ సందర్భంగా కల్లూరు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు శివనందినిని అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ఉన్నత విద్యలో రాణించాలని ఆకాంక్షించారు.

# భక్తిశ్రద్ధలతో ఘనంగా అనంత చతుర్దశి వేడుకలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):**అనంత చతుర్దశి పర్వదినాన్ని పురస్కరించుకుని బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు నివాసంలో గణపతి నవరాత్రోత్సవాల ముగింపు వేడుకలు భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ఆయన గణనాథుడికి ఘనంగా మహామంగళహారతి నిర్వహించారు.అనంతరం ఆధ్యాత్మిక వాతావరణంలో లార్డ్ గణేశుడి నిమజ్జన ఊరేగింపు వైభవోపేతంగా సాగింది. భక్తులు ఉత్సాహంగా పాల్గొని "గణపతి బప్పా మోరియా.. మంగళ్ మూర్తి మోరియా" అంటూ చేసిన నామస్మరణలతో పరిసరాలు మార్మోగాయి. సమాజంలో శాంతి, సౌభాగ్యాలు, సకల జనులకు సుఖసంతోషాలు కలగాలని ప్రార్థిస్తూ భక్తులు గణనాథుడికి వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో నీలేశ్, నరేశ్, కొండల్ రెడ్డిలతో పాటు ఇతర ముఖ్య నాయకులు, కాలనీవాసులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐక్యత, భక్తిభావాల కలబోతగా సాగిన ఈ వేడుకలు ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాయి.



# రూ. 1.25 లక్షలు పలికిన కుద్బిగూడ గణనాథుడి లడ్డూ

### పోటీపడి దక్కించుకున్న అన్నపూర్ణ హోటల్ యజమాని కుమారస్వామి

### లడ్డూ ప్రసాదాన్ని అందజేసిన మాజీ మంత్రి సి. కృష్ణాయాదవ్




**కాచిగూడ, సెప్టెంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** కాచిగూడ డివిజన్ పరిధిలోని కుద్బిగూడలో వినాయక చవితి నవరాత్రోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన గణేశ్ లడ్డూ వేలం పాట ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. నవ్య కళా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుడి మండపం వద్ద శుక్రవారం సాయంత్రం నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం లడ్డూ వేలం పాటను ప్రారంభించారు.భక్తుల పోటాపోటీ నడుమ సాగిన ఈ వేలంలో అన్నపూర్ణ హోటల్ (తెలంగాణ రుచులు) అధినేత కుమారస్వామి అత్యధికంగా రూ. 1,25,000 (ఒక లక్షా పాతిక వేల రూపాయలు) పలికి స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి సి. కృష్ణాయాదవ్ వేలంలో గెలుపొందిన కుమారస్వామికి శాలువా కప్పి, లడ్డూ ప్రసాదాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణనాథుడి ఆశీస్సులతో నగర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన యువత, అసోసియేషన్ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈ వేలం పాట కార్యక్రమంలో అడ్వకేట్ గోవింద్, ప్రముఖులు సంజయ్ బద్రినారాయణ, ఆర్. సంతోష్ కుమార్, అసోసియేషన్ ప్రతినిధులతో పాటు స్థానిక కాలనీవాసులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వినాయక లడ్డూ వేలంలో రూ.లక్ష.. వరుసగా 8వసారి సోను భాయ్‌దే!

### గజేంద్ర యూత్ అసోసియేషన్ లడ్డూ వేలం.. రూ.1 లక్షకు దక్కించుకున్న రాకేష్ గైక్వాడ్

### గణనాథునిపై భక్తి.. లడ్డూ వేలంలో సోను భాయ్ మరోసారి విజయం

### ఎనిమిదేళ్లుగా వినాయక లడ్డూపై సోను భాయ్ ప్రత్యేక అభిమానం




**హైదరాబాద్ సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** గజేంద్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరిగిన లడ్డూ వేలంపాట భక్తిశ్రద్ధల మధ్య ఉత్సాహంగా సాగింది. ఈ వేలంపాటలో టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, హరిబోలి డివిజన్ నాయకులు సోను భాయ్ రాకేష్ గైక్వాడ్ రూ.1 లక్షకు వినాయకుడి లడ్డూను దక్కించుకున్నారు.ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా సోను భాయ్ లడ్డూ వేలంలో పాల్గొని దక్కించుకున్నారు. గత 8 సంవత్సరాలుగా వరుసగా వినాయకుడి లడ్డూను వేలంపాటలో దక్కించుకుంటూ వస్తుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా సోను భాయ్ రాకేష్ గైక్వాడ్ మాట్లాడుతూ.. గణపతి అనుగ్రహంతో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా లడ్డూను వేలంపాటలో దక్కించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గణనాథుని ఆశీస్సులు ఎల్లవేళలా ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో మంధన్ గైక్వాడ్, అనిల్ గౌడ్, సురేష్, పవన్, క్రాంతి, సాయి, చింటూ, అభిషేక్, అఖిల్ గౌడ్, వినయ్ గౌడ్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు శ్రీ భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిరంతర అన్నదానం

- తెల్లవారుజాము దాకా కొనసాగిన ప్రసాద వితరణ




**హైదరాబాద్, సెప్టెంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలో నిర్వహించిన 47వ సామూహిక గణేష్ నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉస్మాన్‌గంజ్ వద్ద సమితి అధ్యక్షులు మేడిశెట్టి రాకేష్, ప్రధాన కార్యదర్శి భద్రేశ్వర్, కోశాధికారి సి.ఎ. అనిల్ నాయర్ నేతృత్వంలో శోభాయాత్రలో పాల్గొనేందుకు హుస్సేన్‌సాగర్ వైపు తరలివచ్చిన వేలాది మంది భక్తులకు అల్పాహారం, అన్నప్రసాదం, తాగునీటిని పంపిణీ చేశారు.అంతకుముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక స్వాగత వేదిక వద్ద అయ్యప్ప స్వామికి శాస్త్రోక్తంగా మహాపడిపూజ నిర్వహించారు. అనంతరం ప్రారంభమైన ఈ అన్నదాన, అల్పాహార వితరణ కార్యక్రమం ఉదయం నుంచి మరుసటి రోజు తెల్లవారుజాము వరకు నిర్విరామంగా కొనసాగింది.ఈ సేవా కార్యక్రమంలో సమితి ప్రతినిధులు విజయభాస్కర్, నార్ల జగదీష్ గుప్తా, నరేష్ పటేల్, మధు, కళ్యాణ్, వై. సంతోష్, కె. హరికృష్ణ, వై. అశోక్, కె. రాజు, శ్రీహరి, సంతోష్, అంజన్, కాలే అమర్నాథ్ తదితరులు పాల్గొని భక్తులకు సేవలందించారు.

# జమాతే ఇస్లామీ సీరత్ ఎక్స్ పో 2026లో ఎంఐఎం సేవలు



### - ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్



**కరీంనగర్, సెప్టెంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** జమాతే ఇస్లామి హింద్ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీరత్ ఎక్స్ పో 2026కు ఎంఐఎం పార్టీ పక్షాన సేవలను తమవంతుగా అందిస్తామని, ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం నగరంలోని సర్కస్ గ్రౌండ్ మహాత్మ జ్యోతిబాపూలే మైదానంలో జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సీరత్ ఎక్స్ పో-2026 ప్రారంభోత్సవ కార్యక్రమంలో గులాం అహ్మద్ హుస్సేన్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ ఊట్కూరు నరేందర్ రెడ్డి, జమాతే ఇస్లామీ జిల్లా అధ్యక్షుడు సోహైబ్ అహ్మద్ ఖాన్, లక్ష్ విద్యాసంస్థల చైర్మన్ ముష్తాఖ్ అహ్మద్, ఆల్ ఇండియా సున్నీ ఉలేమా బోర్డు చైర్మన్ ముఫ్తి నదీమోద్దీన్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ మహనీయ మహమ్మద్ ప్రవక్త జన్మదిన పురస్కరించుకొని మూడు రోజులపాటు జరిగే ఈ సీరత్ ఎక్స్పో 2026 ను కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని చెప్పారు. ఇస్లాం గురించి క్షుణ్ణంగా అర్థం చేసుకునే స్టాల్స్ ను ఇందులో ఏర్పాటు చేశారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంఐఎం పార్టీ కరీంనగర్ పట్టణ శాఖ తరపున ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు ఎక్స్పో కు వస్తున్న సుమారు 30వేల మందికి త్రాగునీటి వసతిని కల్పించనున్నట్లు చెప్పారు. ఈ ఎక్స్ పోలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంపిజె జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్, షోయబ్ లతీఫీ, ఖైరోద్దీన్ పాల్గొన్నారు.

# అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలి: తెలంగాణ భూ రక్షణ సమితి డిమాండ్

**హైదరాబాద్,సెప్టెంబర్ 25 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలోని 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించి 15 లక్షల కుటుంబాలకు పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు కల్పించాలని తెలంగాణ భూ రక్షణ సమితి డిమాండ్ చేసింది. శుక్రవారం రోజున హబ్సిగూడలోని హోటల్ సుప్రభాత్‌లో నిర్వహించిన రాష్ట్ర సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య మాట్లాడుతూ పలు కీలక తీర్మానాలను వెల్లడించారు.నవంబర్ 19న అసైన్డ్ భూములకు పూర్తి యాజమాన్య హక్కులకై ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 19న హైదరాబాద్‌లో 10 వేల మందితో 'అసైన్డ్ భూమి మహాసభ' నిర్వహించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసైన్డ్ భూములపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినందుకు సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటాలకు అన్ని జిల్లా కేంద్రాల్లో పాలాభిషేకం చేయాలని నిర్ణయించారు.కమిటీలో భాగస్వామ్యం: రాష్ట్రంలో 80% అసైన్డ్ భూములు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలవే అయినందున.. కమిటీలో దళిత, బలహీన వర్గాల మంత్రులు, ఎమ్మెల్యేలు, మేధావులతో పాటు



భూ రక్షణ సమితి ప్రతినిధులకు చోటు కల్పించాలి.రెండు నెలల్లో హక్కులు: తగిన విధివిధానాలు రూపొందించి రెండు నెలల వ్యవధిలో లబ్ధిదారులకు యాజమాన్య హక్కుల పత్రాలు అందజేయాలి.ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు మిద్దెపాక సిద్దులు, ప్రధాన కార్యదర్శి సింగరయ్య గౌడ్, హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ, జాయింట్ సెక్రటరీ కొమ్ము సామెల్, కార్యదర్శి సూనుగురు శివ శంకర్, యూనివర్సిటీల ఇంచార్జ్ ఎడ్ల సంపత్, ఐటీ వింగ్ జవాజీ వెంకటేశ్వర ప్రసాద్, సోషల్ మీడియా ఇంచార్జ్ రాజశేఖర్, మహిళా కార్యదర్శి కరోళ్ల అన్నమ్మ, నాయకులు నల్ల నర్సింగరావు, నత్తి కోర్నెల్, సంజీవ్, డప్పు బాలకిష్టయ్య, సాయన్న, ఎర్రబోతుల కనకయ్య, నాగయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.


# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించిన సర్పంచ్ చిన్ని



**మహబుబాబాదు, సెప్టెంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** కురవి మండలం కొత్తూరు(సి) గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ బాదావతు చిన్ని పరిశీలించారు. గ్రామంలో మొత్తం 14 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, అందులో 13 ఇండ్లకు స్లాబ్ పనులు పూర్తయ్యాయి. మిగిలిన ఒక ఇల్లు స్లాబ్ వేయకపోవడంతో లబ్ధిదారురాలు చిప్పరపల్లి మౌనిక ఇంటి వద్దకు స్వయంగా వెళ్లి నిర్మాణ పనులను సర్పంచ్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిన్ని మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న రూ. 5 లక్షలతో 750 స్క్వేర్ ఫీట్లకు మించకుండా నాణ్యతతో ఇంటి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారురాలికి సూచించారు. పెండింగ్ లో ఉన్న స్లాబ్ పనిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పగడాల క్రిష్ణా రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దారోజి శ్రీనివాస్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మలిశెట్టి వేణు, వార్డు సభ్యులు కొంపెల్లి మల్లయ్య గౌడ్, బాదావత్ సిరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లంపల్లిలో రెండు లారీలు ఢీ.. తప్పిన పెను ప్రమాదం





**జేడీ మల్లంపల్లి సెప్టెంబర్ 25 (పీసీడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి ప్రధాన రహదారిపై రెండు లారీలు ఢీకొన్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది.ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.లారీలు ఢీకొనడంతో కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.ప్రధాన రహదారికి ఇరువైపులా నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలను నిలిపివేస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు.ముఖ్యంగా రాత్రి వేళల్లో రహదారిపై నిలిపి ఉంచిన లారీలు ఇతర వాహనదారులకు సరిగ్గా కనిపించక ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికే ఈ ప్రాంతంలో లారీల పార్కింగ్‌పై పలుమార్లు సమస్యలు తలెత్తుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా లారీలను నిర్ణీత ప్రదేశాల్లోనే పార్కింగ్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.తరచూ ప్రమాదాలు చోటుచేసుకునే పరిస్థితి ఏర్పడకుండా అధికారులు రహదారిపై అక్రమ పార్కింగ్‌ను నియంత్రించి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రెండు రోజుల్లో రెండు ఎఫ్ఐఆర్‌లు

## విలేకరిపై దాడి.. మరుసటి రోజే హత్య బెదిరింపులు! రౌడీయిజం చేస్తే ఉపేక్షించేది లేదు: పరకాల పోలీసులు

**పరకాల, సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):**పరకాల పట్టణంలో విలేకరి పాషాపై దాడి, అనంతరం ఆయన బంధువుల ఇంటికి వెళ్లి బెదిరింపులకు పాల్పడిన ఘటనలు కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారంలో మేకల దిలీప్‌పై వరుసగా రెండు రోజుల్లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.వారం రోజుల క్రితం విలేకరి పాషాపై దాడి జరిగినట్లు ఫిర్యాదు అందడంతో పరకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు, అందుబాటులో ఉన్న వివరాలను పరిశీలించిన అనంతరం దిలీప్‌పై కేసు నమోదు చేశారు. అయితే ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తుండగానే మరుసటి రోజు పాషా బంధువుల ఇంటికి వెళ్లి బెదిరింపులకు పాల్పడినట్లు మరో ఫిర్యాదు అందింది. దీంతో పోలీసులు మరోసారి విచారణ చేపట్టి మరో కేసు నమోదు చేశారు.వరుసగా రెండు రోజుల్లో రెండు కేసులు నమోదు కావడం పరకాల పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పలు కేసులు, గతంలో నమోదైన పిట్ కేసులతో పాటు కిడ్నాప్ కేసులో జైలుకు వెళ్లిన ఘటనలు కూడా ఉన్నట్లు




పోలీసుల దృష్టికి రావడంతో తాజా కేసుల దర్యాప్తును పోలీసులు సీరియస్‌గా చేపట్టారు.

### రౌడీషీట్ తెరవాలని పాషా విజ్ఞప్తి

తనపై వరుసగా దాడి, బెదిరింపులు జరుగుతున్న నేపథ్యంలో మేకల దిలీప్‌పై రౌడీషీట్ తెరిచి, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విలేకరి పాషా పోలీసులను కోరారు. తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

### ఇక రౌడీయిజానికి చెక్.. పోలీసుల హెచ్చరిక

వరుస కేసుల నేపథ్యంలో పరకాల కోర్టులో గతంలో ఉన్న కేసులను కూడా పరిశీలించినట్లు, సంబంధిత వ్యక్తికి చివరి అవకాశం ఇచ్చినట్లు సమాచారం. ఇకపై ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని బెదిరింపులు, దాడులు, రౌడీయిజానికి పాల్పడితే ఉపేక్షించబోమని పరకాల పోలీసులు హెచ్చరించారు.

ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు అవసరమైన సందర్భాల్లో రౌడీషీట్ తెరవడానికి కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు హెచ్చరించడంతో పరకాల పట్టణంలో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

# విద్యార్థులకు యూనిఫాంలు, బెల్టుల పంపిణీ




**మల్లంపల్లి సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండల ప్రజా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు గుత్తూరు తండా సర్పంచ్ బానోతు రాజు నాయక్ యూనిఫాంలు, పాఠశాల బెల్టులను పంపిణీ చేశారు. విద్యార్థులకు అవసరమైన యూనిఫాంలు, బెల్టులను అందించడంతో పాఠశాల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు రాజు నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్యలో ప్రోత్సాహం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అంత్యోదయ స్ఫూర్తి ప్రదాత, దేశభక్తికి నిలువెత్తు రూపం

## "పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ" బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం....

**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** అంత్యోదయ స్ఫూర్తి ప్రదాత, దేశభక్తికి నిలువెత్తు రూపం "పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ" అని బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం కొనియాడారు.భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున పార్లమెంట్ కార్యాలయంలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ సమాజాభివృద్ధే ధ్యేయంగా దీన్ దయాల్ జీవితం కొనసాగిందన్నారు. భరతమాత ముద్దుబిడ్డ, దేశోద్ధారకుడయిన పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ప్రతిపాదించిన 'ఏకాత్మ మానవతావాదం' భావజాలం దేశ రాజకీయాలకు, సమాజానికి ఎప్పటికీ మార్గదర్శకమన్నారు. 'అంత్యోదయ' సిద్ధాంతమే మన మార్గం అని, సమాజంలో అట్టడుగున ఉన్న చివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలనే ధ్యేయంతో



పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ 'అంత్యోదయ' సిద్ధాంతం కోసం తన జీవితాన్ని పూర్తిగా అంకితం చేశారని తెలిపారు. పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ నిస్వార్థ రాజకీయాలు, అంకితభావం, దేశభక్తి నేటి తరానికి నిలువెత్తు నిదర్శనమన్నారు.. ప్రతి బీజేపీ కార్యకర్త ఆయన ఆశయాలను, సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగానీ శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి యాదగిరి సునీల్ రావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి ,గుజ్జ శ్రీనివాస్ , ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఆడి చెర్ల రాజు , గుంజేటి శివ కుమార్ , కటకం లోకేష్ , ఊగిలే సుధాకార్, ముత్యాల జగన్ రెడ్డి, జోన్ , మండల ఆద్యక్షులు మాడిశెట్టి సంతోష్, పాదశీ శివరాజ్, జాడి బాల్ రెడ్డి, అవుధూర్తి శ్రీనివాస్, కుంట తిరుపతి, కార్పొరేటర్ లు బండ రమణారెడ్డి, కర్రే అనిల్ , నాంపల్లి శ్రీనివాస్ , దాసరి రమణారెడ్డి బీజేవైఎం నాయకులు గుర్రం వెంకటేష్ కోలా అశోక్ లు పాల్గొని దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# గణపతి లడ్డూ రూ.1.40 లక్షలు

## -13వ వార్డు కౌన్సిలర్ ఉప్పు నాగమణిహనుమంతు దంపతుల సొంతం

**సత్తుపల్లి, సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):**
పట్టణంలోని 13వ వార్డు కృష్ణ మందిరంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన గణనాథుడి లడ్డూ వేలంలో 13వ వార్డు కౌన్సిలర్ ఉప్పు నాగమణి, హనుమంతు దంపతులు రూ.1,40,116కు లడ్డూను దక్కించుకున్నారు. భక్తుల సమక్షంలో నిర్వహించిన వేలంలో లడ్డూను సొంతం చేసుకున్న దంపతులను పలువురు అభినందించారు.ఈ సందర్భంగా 1వ వార్డు కౌన్సిలర్ మట్టా ప్రసాద్, కాంగ్రెస్ యువ నాయకులు మానస నాని, ఉప్పు నాగమణి, హనుమంతు దంపతులను కలిసి అభినందనలు తెలిపారు. గణనాథుడి ఆశీస్సులతో వారి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.



# కరీంనగర్ న్యాయవాదుల కో-ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంను ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి....






**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అడ్వకేట్ మ్యూచువల్ ఎడెడ్ కోపరేటివ్ త్రిఫ్ట్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ నూతన అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జ్ ఎస్ శివ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్బంగా సొసైటీ చైర్మన్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ తెలిపారు. న్యాయవాదుల కుటుంబాల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సొసైటీ ని న్యాయవాదులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.సమాఖ్య అభివృద్ధి కోసం న్యాయవాదులు సహకారం అందించాలని కోరారు.సొసైటీ ద్వారా లభించే సేవలన్నీ దిన,దినాభి వృద్ధి చెందాలని కార్యక్రమంలో పాల్గొన్న పలువురు న్యాయవాదులు ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సిహెచ్.కిరణ్ కుమార్, సెక్రెటరీ బెజ్జంకి శ్రీకాంత్, జాయింట్ సెక్రెటరీ బొడ్ల గీతారాణి,ట్రెజరర్ సుంకే దేవకిషన్ మరియు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ డా.ఎం మదన్ బాబు,బి.శివకుమార్,ఎం.అనురాధ,సిహెచ్.భూమా చారి,బి.శ్రీనివాస్,బి. స్వామి,బి.శాంతి కుమార్, యూ.కరుణ శ్రీ, తదితర న్యాయవాదులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఘనంగా వందేమాతరం సామూహిక గానం

### - "ఒకే సమయంఒకే స్వరంవందేమాతరం" నినాదంతో దేశభక్తి వెల్లువ



**కరీంనగర్, సెప్టెంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** వందేమాతరం గీతం 150వ సంవత్సరాన్ని పురస్కరించుకుని విద్యాభారతి ఆధ్వర్యంలో "ఒకే సమయంఒకే స్వరంవందేమాతరం" నినాదంతో సామూహిక గాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ సరస్వతీ శిశుమందిర్ హైస్కూల్‌లో సుమారు 1,200 మంది విద్యార్థులు, 100 మంది సిబ్బంది, తల్లిదండ్రులు ఒకే స్వరంతో వందేమాతరం ఆలపించారు.వందేమాతరం 150 ఉత్సవ సమితి అధ్యక్షులు డా. ఎడవెల్లి విజయేందర్ రెడ్డి ముఖ్య వక్తగా పాల్గొని గీతం చారిత్రక ప్రాధాన్యతను, స్వాతంత్ర్యోద్యమంలో దాని పాత్రను వివరించారు. పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ ఐక్యత, భారతీయ సంస్కృతిపై గౌరవాన్ని పెంపొందించడమే కార్యక్రమ ఉద్దేశమన్నారు.కరీంనగర్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లోని పలు విద్యాసంస్థల్లోనూ సామూహిక గానం నిర్వహించారు. విద్యార్థులు, ఆచార్యులు, తల్లిదండ్రులు, విద్యాభారతి కార్యకర్తలు, ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# రైతు మహాసభలకు పూర్వ విద్యార్థుల సంపూర్ణ మద్దతు

### - 26న ఖమ్మంలో పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపై ఖమ్మంలో జరగనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జాతీయ మహాసభలకు మద్దతుగా పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎం.ఎఫ్. గోపీనాథ్, కార్యదర్శి తాళ్లూరి వేణు తెలిపారు.ఈ నెల 26న సాయంత్రం 5 గంటలకు ఖమ్మం నగరంలోని వేదిక ఫంక్షన్‌హాల్‌లో సమ్మేళనం జరగనుంది. పీడీఎస్‌యూ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు పి. ప్రసాద్, సాధినేని వెంకటేశ్వరరావు, ఎం. శ్రీనివాస్‌తో పాటు కాకి భాస్కర్, తిరుమల్‌రావు, చిర్రా రవి, దేవిరెడ్డి విజయ్, నాగమణి, ఎన్. తిరుమల్, మస్తాన్ తదితరులు పాల్గొన నున్నారు.ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఖమ్మంలో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జాతీయ మహాసభలు జరగనున్నాయి. సమ్మేళనానికి పూర్వ విద్యార్థులు, మాజీ నాయకులు, ఉద్యమ సహచరులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# 30న కరీంనగర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

### • నూతన కలెక్టరేట్ ప్రారంభం..

### మూడు అంశాలపై కాంగ్రెస్ సమావేశంలో తీర్మానాలు




**కరీంనగర్, సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :**
ఈ నెల 30న కరీంనగర్‌లో నూతన సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వైద్యుల అంజన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఎం పర్యటన ఏర్పాట్లు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ గడువు పొడిగింపు, సెప్టెంబర్ 28న ధర్నా నిర్వహణపై చర్చించారు.ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో సాంకేతిక సమస్యలు ఉన్నాయని, గడువును డిసెంబర్ వరకు పొడిగించాలని నాయకులు డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 28న ఓటర్ల జాబితా అంశంపై కలెక్టరేట్ వద్ద ధర్నాలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.సీఎం పర్యటన సందర్భంగా నగరంలోని ప్రధాన కూడళ్లు, 66 డివిజన్లలో పార్టీ జెండాలు, తోరణాలతో అలంకరణ చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, సత్తు మల్లేశం, ఆరెపల్లి మోహన్, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, పురుమల్ల శ్రీనివాస్, కర్ర రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యపై సబ్ కలెక్టర్ స్పందన

### పేరువంచ జడ్పీహెచ్‌ఎస్‌లో సోషల్ టీచర్ నియామకానికి ఆదేశాలు





**కల్లూరు, సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండలంలోని పేరువంచ గ్రామ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో సోషల్ సబ్జెక్టు ఉపాధ్యాయుడు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యపై సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ స్పందించారు. పాఠశాలలో పనిచేస్తున్న సోషల్ టీచర్ జూన్ 30న పదవీ విరమణ చేయడంతో అప్పటి నుంచి ఆ సబ్జెక్టును బోధించేందుకు ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని గ్రామ సర్పంచ్ నిర్మల మోహన్‌రెడ్డి సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.సోషల్ సబ్జెక్టు బోధనకు ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థుల చదువుపై ప్రభావం పడుతోందని, ముఖ్యంగా ఉన్నత తరగతుల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ వివరించారు. విద్యార్థుల విద్యా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమస్యను తక్షణమే పరిష్కరించాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. సర్పంచ్ వినతిపై సబ్ కలెక్టర్ వెంటనే స్పందించారు. విద్యార్థుల విద్యా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పేరువంచ జడ్పీహెచ్ఎస్‌లో సోషల్ సబ్జెక్టుకు ఉపాధ్యాయుడిని నియమించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాఠశాలలో నెలకొన్న ఉపాధ్యాయుల కొరతకు త్వరలో పరిష్కారం లభించనుందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన చోట ఉపాధ్యాయుల కొరతను పరిష్కరించాలని సర్పంచ్ కోరారు. విద్యార్థుల సమస్యను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారం కోసం చర్యలు చేపట్టినందుకు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

# జ్ఞానేష్ కుమార్ నేరం - దేశద్రోహం

### - సిపిఐ (యం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు




**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భారతపౌరుల ప్రాథమిక, ప్రజాస్వామిక హక్కు అయిన ఓటును చోరీచేసి ఎన్నికల కమీషన్, బిజెపి ఎన్నికల కమీషన్ గా జ్ఞానేష్ కుమార్ చేసిన నేరం దేశద్రోహకరమైనదని ఇంతటి తీవ్రమైన నేరం వెనుక నరేంద్రమోడీ, అమీక్ష తదితరులు ఉన్నారని సిపిఐ (యం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో పోటు రంగారావు మాట్లాడుతూ.. సర్ పేరుతో దేశంలో 13 కోట్ల మంది ఓటర్లను (దాదాపు 12%) తొలగించడం భారీకుట్ర అన్నారు. ఫలితాలను తారుమారు చేసి బిజేపిని అడ్డదారిల్లో, దొడ్డి దారిల్లో అధికారంలోకి వచ్చారని ఇది పకడ్బంధీ కుట్ర అన్నారు. 2024 ఎన్నికల్లో ప్రతిపక్షం కేవలం 2% ఓట్లతోనే ఓడిపోయిందన్నారు. బీహార్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్రలోను ఇలాంటి కుట్రవలనే బిజెపి అధికారంలోకి తీసుకువచ్చారని ఆరోపించారు. జ్ఞానేష్ కుమార్ బిజెపితో కుమ్మక్కై చేసిన ఈ పద్ధతి నేరమని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల వ్యవస్థని పక్కనబెట్టి విధ్వసం చేసే చర్యగా అభివర్ణించారు. జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని ఆయన్ను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఆయనపై దేశద్రోహం నేరం క్రింద కేసు నమోదు చేయాలన్నారు. సర్వీస్ ను రద్దుచేయాలన్నారు. 2024, 25, 26 లో జరిగిన ఎన్నికలను రద్దుచేసి పాత ఓటర్ల లిస్టుద్వారానే తిరిగి ఎన్నికలు జరపాలన్నారు. ఎన్నికల కమీషన్, ఎన్నిక పాతపద్ధతిలో అధికారపక్షనేత, ప్రతిపక్షనేత అలానే సుప్రీంకోర్టు జడ్జిచేత ఎన్నిక కాబడాలన్నారు. జ్ఞానేష్ కుమార్ చేసిన అవకతవకలపై విచారణచేసి చేసిన దేశద్రోహంపై ఆయన్ను వెంటనే తొలగించాలనే డిమాండ్ తో దేశవ్యాప్తంగా జరిగే ఆందోళనలో భాగస్వాములు కావాలని ప్రజలను, ప్రజాస్వామికవాదులను సి.పి.ఐ. (యం.ఎల్) మాస్లైన్ కోరుతుందన్నారు.**అక్టోబర్ 5, 6 తేదీలలో ధర్నాలు, ప్రదర్శనలు :** రాష్ట్ర ప్రభుత్వం, వాగ్ధానమైన అన్నిరకాల పెన్షన్లు పెంచాలని, కొత్తవారికి తక్షణమే పెన్షన్లు మంజూరు చేయాలని, మహిళలకు, వ్యవసాయ కార్మికులకు ఇచ్చే పెన్షన్లు మంజూరు చేయాలని, విద్యుత్ కోతలు ఎత్తివేయాలని, కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించే విధానాన్ని రద్దుచేయాలని, యు.పి.ఐ. (ఫోన్పే, గూగుల్ పే) పై పన్ను విధించే ప్రయత్నాన్ని విరమింపజేసుకోవాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 5, 6 తేదీలలో డివిజన్, జిల్లా కేంద్రాలలో సి.పి.ఐ. (యం.ఎల్)మాస్ లైన్, అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఎ.ఐ.యు.కె.ఎస్) ఆధ్వర్యంలో ప్రదర్శన, ధర్నాలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీలు పిలుపునిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు అయినా ఇచ్చిన వాగ్ధానాలను అమలు పరచకుండా మాటలతో కాలయాపన చేస్తుంది. అధికార పక్షం, ప్రతిపక్షం, ప్రజా సమస్యలను వదిలి తిట్లదండ కాలంతో పరస్పర కుంభకోణాల ఆరోపణ కాలం గడుపుతున్నారన్నారు. దీనిని వదిలి వాగ్ధానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

**పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి :** ఆరంభంలో వర్షాలు లేక, నేడు తుఫాన్తో అనేక రకాల పంటలను రైతులు నష్టపోయారు. ప్రభుత్వం దీనిపై శాస్త్రీయంగా అంచనావేసి నష్టపరిహారం చెల్లించాలి. తక్షణ సాయంగా రైతాంగానికి ఎకరానికి 25 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావుతో పాటు జిల్లా కార్యదర్శి సి.వై. పుల్లయ్య, నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, జి. రామయ్య, ఆవుల అశోక్, బందెల వెంకయ్య, కమ్మకోమటి నాగేశ్వరరావు, మలీదు నాగేశ్వరరావు, ఝాన్సీ, శిరోమణి, శోభ, కోయల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జ్వరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



### - ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీని అరికట్టాలి: తెలంగాణ రక్షణ సేన




**కరీంనగర్, సెప్టెంబర్25 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లాలో పెరుగుతున్న జ్వరాలను నియంత్రించడంతో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ, అనవసర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న విధానాన్ని అరికట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో పార్టీ నాయకులు జిల్లా వైద్య ఆరోగ్య అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా జిల్లాలో జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా, ప్లేట్‌లెట్లు తగ్గడం, గొంతునొప్పి, వైరల్ ఫీవర్ తదితర సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రులను ప్రజలు అధికంగా ఆశ్రయిస్తున్న నేపథ్యంలో రోగుల రద్దీకి అనుగుణంగా వైద్య పరీక్షలు, అవసరమైన మందులు, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అధిక ఛార్జీలు వసూలు చేయడం, అవసరం లేని పరీక్షలు చేయించడం వంటి ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ అంకం శివరాణి, నగర పార్టీ అధ్యక్షుడు రంగరవేణి లక్ష్మణ్, జిల్లా సీనియర్ నాయకులు శ్రీరాములు రమేష్, బసవేణి రాజేందర్, చంటి శ్రీనివాస్, గర్షకుర్తి విద్యాసాగర్, కొత్వల అంజనేయు లు, బండారి అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.



# అదరగొట్టిన భారత కబడ్డీ జట్టు.. ఫైనల్స్‌కి దూసుకెళ్లింది..

ఐచి: ఆసియా క్రీడల్లో భారత పురుష, మహిళ కబడ్డీ జట్లు అదరగొడుతున్నాయి. ఇప్పటికే మహిళ జట్టు ఫైనల్స్‌కి దూసుకెళ్లగా.. తాజాగా పురుషుల జట్టు ఫైనల్స్‌కు చేరింది. శుక్రవారం ఐచి వేదికగా థాయ్‌లాండ్‌తో జరిగిన పోరులో ఘన విజయం సాధించి తుది పోరుకు చేరుకుంది. థాయ్‌లాండ్‌పై భారత్ 66–28 స్కోర్‌తో ఘన విజయం సాధించింది. దీంతో ఈ ప్రతిష్టాత్మక క్రీడల్లో భారత్‌కు మరో పతకం ఖాయమైంది. శనివారం జరిగే ఫైనల్ పోరులో భారత పురుషుల కబడ్డీ జట్టు తైవాన్ లేదా ఇరాన్‌తో తలపడే అవకాశముంది. అంతకు ముందు భారత మహిళల కబడ్డీ జట్టు కూడా సత్తా చాటింది. సెమీ ఫైనల్‌లో నేపాల్‌ను 48–24 తేడాతో భారత్ చిత్తు చేసింది. కాగా టోర్నమెంట్‌లో మెన్స్, ఉమెన్స్ కబడ్డీ జట్లు ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోలేదు.

# ఆసియా క్రీడలు.. ఆఫ్ఘానిస్థాన్‌పై నేపాల్ ఘన విజయం

ఆసియా క్రీడల్లో భాగంగా శుక్రవారం అఫ్ఘానిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో నేపాల్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 102 పరుగులు మాత్రమే చేసింది. అఫ్గాన్ బ్యాటింగ్‌లో ఫైజల్ ఖాన్ 30, నజీబుల్లా జద్రాన్ 30 మినహా మిగితా వాళ్లందరూ సింగిల్ డిజిట్ స్కోర్‌కే పరిమితమయ్యారు. నేపాల్ బౌలింగ్‌లో కౌషల్ భుర్టెల్ 4 వికెట్లు, లలిత్ రాజ్‌బాన్సీ 3 వికెట్లు



తీశారు. ఆ తర్వాత ఈ లక్ష్యాన్ని 17.2 ఓవర్లలో చేధించింది. నేపాల్ బ్యాటింగ్2లో సందీప్ జోరా 34, రోహిత్ పౌడెల్ 33(నాటౌట్) రాణించారు. అఫ్గాన్ బౌలింగ్‌లో ఫరిదూన్, అద్బొల్లా, అరబ్ గుల్ తలో వికెట్ తీశారు.

# ఆసియా క్రీడలు.. భారత్‌కు రెండో స్వర్ణ పతకం..



జపాన్‌లో ఆసియా క్రీడలు 2026 ఘనంగా జరుగుతున్నాయి. ఈ క్రీడల్లో తమ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడంలో అథ్లెట్లు పోటీ పడుతున్నారు. కాగా, ఇప్పటికే భారత్‌కు క్రికెట్‌లో స్వర్ణపతకం లభించిన విషయం తెలిసిందే. ఇప్పుడు మన దేశానికి మరో స్వర్ణ పతకం లభించింది. షూటింగ్ విభాగంలో తొలుత మను బాకర్ వంటి స్టార్ షూటర్లు నిరాశ పరిచినా.. ఇప్పుడు ఏకంగా గోల్డ్ మెడల్ దక్కింద. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవట?ంలో భారత షూటర్లు కమల్‌జీత్, సురుచి సింగ్ స్వర్ణం సాధించారు. దీంతో ఈ క్రీడల్లో భారత్‌కు రెండో పసిడి పతకం లభించింది. ఈ విభాగం మెడల్ రౌండ్‌లో మొత్తం నాలుగు జోడీలు ఫైనల్2కు అర్హత సాధించారు. ఇందులో కమల్‌జీత్, సురుచి కలిసి మొత్తంగా 484.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. దక్షిణ కొరియా ద్వయానికి రజతం, ఇరాన్ జోడీకి కాంస్యం దక్కాయి.

# రజనీకాంత్ 'జైలర్-2' పాటకు డేవిడ్ వార్నర్ డ్యాన్స్ చేస్తే..



ఆసీస్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ అంటే క్రికెట్ అభిమానులకే కాదు.. సినీ ప్రియులకు కూడా ఎంతో ఇష్టం. లాక్‌డౌన్ సమయంలో ఆయన పలు పాటలకు డ్యాన్స్‌లు చేస్తూ అప్‌లోడ్ చేసిన వీడియో ఎంతో వైరల్ అయ్యాడు. ఆ తర్వాత నుంచి వార్నర్‌ని డేవిడ్ భాయ్ అని పిలవడం ఫ్యాన్స్‌కి అలవాటు అయింది. గత ఏడాది నితిన్ హీరోగా వచ్చిన 'రాబిన్‌హుడ్' అనే సినిమాలో ఈ ప్రత్యేక పాత్రలో కనిపించారు వార్నర్. అయితే ఆ సినిమా ఊహించినంత సక్సెస్ సాధించలేదు.ఇప్పుడు డేవిడ్ వార్నర్ మరో వీడియోతో ఫ్యాన్స్ ముందుకొచ్చారు. 'జైలర్–2' చిత్రంలోని 'అల బోలేలో' పాటకి వార్నర్ డ్యాన్స్ చేస్తే ఎలా ఉంటుందో అనేలా ఓ ఎఐ వీడియోని క్రియేట్ చేశారు. దీన్ని వార్నర్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. "ఇది ఎవరు చేశారో నాకు తెలీదు.. కానీ, నా డ్యాన్స్‌కు ఎన్ని మార్కులు ఇస్తారు' అని క్యాప్షన్ పెట్టాడు. దీనిపై అభిమానులు రకరకాలుగా కామెంట్లు చేస్తున్నారు.

# విండీస్‌తో తొలి వన్డే.. సచిన్ రికార్డును కోహ్లీ బ్రేక్ చేస్తాడా?



వెస్టిండీస్ జట్టుతో ఆదివారం నుంచి టీం ఇండియా వన్డే సిరీస్‌లో తలపడనుంది. తొలి వన్డే తిరువనంతపురం వేదికగా జరగనుంది. ఇప్పటికే అక్కడకు చేరుకున్న భారత జట్టు ప్రాక్టీస్ ప్రారంభించింది. అయితే ఈ తొలి మ్యాచ్‌లో టీం ఇండియా పరుగుల రారాజు విరాట్ కోహ్లీ ఓ ప్రపంచ రికార్డును బ్రేక్ చేసే అవకాశం ఉంది. అది ప్రస్తుతం భారత దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది. తిరువనంతపురంలో జరిగే వన్డేలో కోహ్లీ మరో 59 పరుగులు చేస్తే.. అంతర్జాతీయ వన్డేల్లో అత్యంత వేగంగా 15,000 పరుగులు పూర్తి చేసుకున్న క్రికెటర్‌గా ప్రపంచ రికార్డు సృష్టిస్తాడు. విరాట్ ఇప్పటివరకూ 311 ఇన్నింగ్స్‌లో 14,941 పరుగులు చేశాడు. సచిన్ టెండూల్కర్ 377 ఇన్నింగ్స్‌లో ఈ మైలురాయి చేరుకున్నారు. మరోవైపు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఓ మైలురాయికి చేరువలో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో రోహిత్ 105 పరుగులు చేస్తే.. వన్డేల్లో 12,000 పరుగుల మైలురాయిని చేరుకుంటాడు. మరి విరాట్–రోహిత్ ఈ రికార్డులు సాధిస్తారో లేదో చూడాలి.




# మన్‌ప్రీత్ కౌర్‌కు కాంస్యం

–హైదరాబాద్: ఆసియా క్రీడల్లో మహిళల షాట్ పుట్ విభాగంలో భారత్‌కు చెందిన మన్‌ప్రీత్ కౌర్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. మన్‌ప్రీత్ తన నాల్గో ప్రయత్నంలో 17.17 మీటర్ల అత్యుత్తమ దూరాన్ని నమోదు చేసి పతకాన్ని ఖరారు చేసుకున్నారు. చైనాకు చెందిన సాంగ్ జియాయువాన్ 19.40 మీటర్ల ప్రదర్శనతో స్వర్ణాన్ని, అదే దేశానికి చెందిన జాంగ్ లిన్‌రు 18.14 మీటర్లతో రజతాన్ని కైవసం చేసుకున్నారు. ఇదే ఈవెంట్‌లో మరో భారత క్రీడాకారిణి కృష్ణ జయశంకర్ మీనన్ ఐదవ స్థానంలో నిలిచారు.

# తొలి రౌండ్‌లోనే సాత్విక్-చిరాగ్ ఓటమి

హైదరాబాద్: ఆసియా క్రీడల పురుషుల డబుల్స్ బ్యాడ్మింటన్ విభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్స్ సాత్విక్‌సాయిరాజ్ రెడ్డి చిరాగ్ శెట్టి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో థాయిలాండ్‌కు చెందిన సుక్‌ఫున్, పక్కపోన్ టీరారత్సాకుల్ జోడీ చేతిలో ఓడిపోయారు. ఊహించని విధంగా నాలుగో సీడ్ హోదాలో బరిలోకి దిగిన ఈ భారత జోడీ, 21–12, 19–21, 14–21 తేడాతో ఓటమిని చవిచూసింది.





# ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో స్వర్ణం

హైదరాబాద్ : ఐచీ–నగోయా ఆసియా గేమ్స్‌లో ఆరో రోజు భారత్‌కు అద్భుతమైన ఆరంభం లభించింది. షూటర్లు సత్తా చాటడంతో భారత్ ఖాతాలో ఒక స్వర్ణం, ఒక రజతం చేరాయి. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్‌లో సురుచి, కమల్‌జీత్ జోడీ పసిడి పతకాన్ని ముద్దాడింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ టీమ్ ఈవెంట్‌లో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, నీరజ్ కుమార్, రుద్రాంక్ష్ పాటిల్‌తో కూడిన జట్టు రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయంతో దేశ పతకాల సంఖ్య 19కి చేరింది. మరోవైపు, స్వర్ణం గెలిచిన సురుచి–కమల్‌జీత్ జోడీ, క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఆసియా రికార్డును సమం చేయడం విశేషం



# అప్పుడు కాంస్యం.. ఇప్పుడు రజతం.. మారథాన్‌లో మళ్లీ మెరిసిన గుల్వీర్..!


జపాన్‌లోని నగోయలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు మెరుస్తున్నారు. పురుషుల100 మీటర్ల పరుగులో గురిందెర్వీర్ సింగ్, అనిమేశ్ కుజుర్‌లు నిరాశపరిచినా.. 'నేనున్నాంటూ' మారథాన్ పరుగులో గుల్వీర్ సింగ్ పతకంతో మెరిశాడు. 10 వేల మీటర్లలో సత్తా చాటిన గుల్వీర్ రెండో స్థానంలో నిలిచి దేశానికి సిల్వర్ మెడల్ అందించాడు. దాంతో.. ఆసియాడ్‌లో వరసగా రెండో పతకం ఖాతాలో వేసుకున్నాడీ రన్నర్. 2023లో హంగ్జూలో గుల్వీర్ కాంస్యం సాధించాడు.పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్ వెండి వెలుగులు విరజిమ్మాడు. పురుషుల 10 వేల మీటర్ల పరుగులో అసమాన పట్టుదలను ప్రదర్శించిన అతడు సిల్వర్ మెడల్ సాధించాడు. ఆసియాడ్ వంటి పెద్ద వేదికలపై నేను ఎప్పుడూ నిరాశపరచను అని చాటుతూ పోడియం మీద సగర్వంగా నిలబడ్డాడీ రన్నర్. శుక్రవారం జరిగిన పురుషుల 10 వేల మీటర్ల పరుగులో గుల్వీర్ 28:29.38 నిమిషాల్లో లక్ష్యాన్ని చేరుకున్నాడు. అతడి కంటే 1.87 సెకన్ల ముందుగా పరుగు పూర్తి చేసిన బిర్హను బలెవ్(బహ్రెయిన్) స్వర్ణం ఎగరేసుకుపోయాడు.

# ‘ది ప్యారడైజ్’లో కయాదు లోహర్ పాత్రపై విమర్శలు.. శ్రీకాంత్ ఓదెలకి నెటిజన్ల ప్రశ్నలు



నేచురల్ స్టార్ నాని నటించిన ‘ది ప్యారడైజ్’కు విడుదల తర్వాత మిశ్రమ స్పందన వస్తోంది. సినిమా కథ, నాని నటన, యాక్షన్ సన్నివేశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నప్పటికీ.. ఈ చిత్రంలో కయాదు లోహర్ పోషించిన సుబ్బు పాత్ర మాత్రం ప్రత్యేకంగా చర్చకు వచ్చింది. ముఖ్యంగా ఆ పాత్రను దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన విధానంపై సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సినిమాలో సుబ్బు పాత్రకు సినీ నటి కావాలనే కోరిక ఉంటుంది. తల్లి వద్దని వారించినా మద్రాస్ వెళ్లి సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నిస్తుంది. అయితే అనుకున్న స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతుంది. అదే సమయంలో తన తండ్రి చేసిన అప్పుల కారణంగా కుటుంబం ఎదుర్కొంటున్న అవమానాలను చూస్తుంది. ఎలాగైనా ఆ అప్పులు తీర్చాలని నిర్ణయించుకున్న సుబ్బు.. డబ్బు కోసం బీ గ్రేడ్ చిత్రాల్లో నటించడం ప్రారంభిస్తుంది.ఇక్కడే ‘ది ప్యారడైజ్’లోని కొన్ని సన్నివేశాలపై ప్రేక్షకుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సుబ్బు నటించే బీ గ్రేడ్ చిత్రాలకు ‘చుక్క చిత్రాలు’ అనే పేరు పెట్టడం, వాటిని ప్రదర్శించే సన్నివేశాల్లో హీరోయిన్ పాత్రను చూపించిన తీరు అవసరానికి మించి గ్లామర్‌ను ప్రధానంగా చూపించిందని కొందరు ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. కథలో ఆ పాత్ర ఎదుర్కొంటున్న బాధ, పరిస్థితుల తీవ్రత ప్రేక్షకులకు బలంగా కనెక్ట్ కావాల్సిన చోట.. కొన్ని సన్నివేశాలు వేరే విధంగా స్పందన తెచ్చుకున్నాయని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. మరోవైపు సుబ్బు నడుముపై ఉండే సీతాకోకచిలుక టాటూ కూడా కథలో కీలకంగా ఉపయోగించారు. బీ గ్రేడ్ చిత్రాల్లో ఆమె ముఖాన్ని చూపించకుండా ఆ టాటూ ద్వారా గుర్తుపట్టేలా సన్నివేశాలను రూపొందించారు. అయితే ఆ విషయాన్ని హీరో తెలుసుకున్న తర్వాత వచ్చే సన్నివేశంలో నాని చెప్పే కొన్ని సంభాషణలపైనా విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా మహిళలను అవమానించేలా అనిపించే పదజాలాన్ని ఉపయోగించడంపై కొందరు ప్రేక్షకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.వాస్తవానికి సుబ్బు పాత్ర వెనుక ఉన్న ఉద్దేశం భావోద్వేగంగా ప్రేక్షకులను కదిలించడమే అయి ఉండొచ్చనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. కుటుంబ అప్పులు తీర్చడానికి ఒక యువతి తనకు ఇష్టం లేని మార్గంలోకి వెళ్లాల్సి రావడం, ఆ తర్వాత ఆ విషయం హీరోకు తెలియడం వంటి అంశాలతో బలమైన భావోద్వేగాన్ని పండించాలని దర్శకుడు ప్రయత్నించినట్లు కనిపిస్తోంది. అయితే ఆ సన్నివేశాల చిత్రీకరణ కారణంగా ఆశించిన భావోద్వేగం కంటే భిన్నమైన స్పందన వచ్చిందని కొందరు ప్రేక్షకులు అంటున్నారు. సోషల్ మీడియాలో కొంతమంది కయాదు లోహర్ సన్నివేశాలనే సినిమా కు సంబంధించిన చర్చలో ప్రధాన అంశంగా మార్చుకుని ట్రోల్ చేస్తున్నారు. మరికొందరు మాత్రం ఆ పాత్రను విమర్శించాల్సిన అవసరం లేదని, పాత్రను ఎలా రాశారు, ఎలా చూపించారు అనే అంశంపైనే చర్చ జరగాలని అంటున్నారు. అంటే.. విమర్శల ప్రధాన కేంద్రం కయాదు లోహర్ కాదు, ఆమె పాత్రను తెరపై ఆవిష్కరించిన విధానమే అన్నది వారి అభిప్రాయం.

# ‘పార్కింగ్’ దర్శకుడితో శివకార్తికేయన్ కొత్త సినిమా.. పూజా కార్యక్రమాలతో లాంచ్!




ఈ చిత్రంలో శివకార్తికేయన్ సరసన కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, యువ సంగీత సంచలనం సాయి అభ్యాంకర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నట్లు సమాచారం. పర్ఫెక్ట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్‌పై కోలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. శివకార్తికేయన్ తన తదుపరి సినిమాలతో పాటు ఈ ‘ఎస్కే27’ షూటింగ్ షెడ్యూల్స్‌ను కూడా బ్యాలెన్స్ చేయనున్నారు.కోలీవుడ్ టాలెంటెడ్ హీరో శివకార్తికేయన్ (రాఆఋఝుఽఝుతీస్త్రఆఎవఝుఅ) హీరోగా తెరకెక్కుతున్న తాజా సినిమా ‘ఎస్కే27’ అధికారికంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాణ సంస్థ సత్యజ్యోతి ఫిలింస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. విమర్శకుల ప్రశంసలు పొందిన ‘పార్కింగ్’ (ఞుతీఎఆఅస్త్ర) చిత్రంతో జాతీయ అవార్డును గెలుచుకున్న టాలెంటెడ్ డైరెక్టర్ రామ్‌కుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రొడక్షన్ పనులు గ్రాండ్‌గా మొదలయ్యాయి.

# తెలుగులోకి ‘హనుమాన్ అన్శ్’.. త్రివిక్రమ్ తప్పుకోవడంతో ఇప్పుడు హోంబళే ఫిల్మ్స్ ఎంట్రీ?




హిందీ చిత్ర పరిశ్రమలో భక్తి ప్రధాన కథాంశంతో రూపొందిన కొన్ని సినిమాలు ఇటీవల భారీ విజయాలను అందుకుంటున్నాయి. అదే బాటలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ‘హనుమాన్ అన్శ్’ కూడా మంచి ఆదరణను సొంతం చేసుకుంటూ వసూళ్ల పరంగా దూసుకెళ్తున్నట్లు సమాచారం. భక్తి, పురాణ నేపథ్య అంశాలను ఆసక్తికరంగా మేళవించిన ఈ సినిమాపై ఉత్తరాది ప్రేక్షకుల్లో మంచి స్పందన కనిపించడంతో.. ఇప్పుడు దక్షిణాది భాషల్లోనూ విడుదల చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులకు ఈ సినిమాను అందించేందుకు తొలుత ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ముందుకు వచ్చినట్లు వార్తలు వచ్చాయి.సినిమాకు తెలుగు డబ్బింగ్ వెర్షన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంలో ఆయన భాగస్వామ్యం ఉండబోతుందని ప్రచారం జరిగింది. దీంతో తెలుగు ప్రేక్షకుల్లోనూ ఈ చిత్రంపై ఆసక్తి ఏర్పడింది. అయితే విడుదలకు కొన్ని రోజుల ముందు అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. కొన్ని కారణాల వల్ల త్రివిక్రమ్ ఈ సినిమా తెలుగు విడుదల వ్యవహారం నుంచి తప్పుకున్నారని ప్రచారం మొదలైంది. దీంతో అసలు ‘హనుమాన్ అన్శ్’ తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తుందా లేదా అనే సందేహాలు కూడా వ్యక్తమయ్యాయి.ఇప్పుడు తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. దక్షిణాది ప్రేక్షకులకు సినిమాలను పరిచయం చేయడంలో ముందుండే ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబళే ఫిల్మ్స్ ‘హనుమాన్ అన్శ్’ తెలుగు సహా దక్షిణాది భాషల విడుదల బాధ్యతలను తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం.అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. హోంబళే ఫిల్మ్స్ ఈ సినిమాను దక్షిణాదిలో విడుదల చేస్తుందనే వార్త ప్రస్తుతం పరిశ్రమ వర్గాల్లో వినిపిస్తున్న ప్రచారం మాత్రమే. సంస్థ నుంచి అధికారికంగా ప్రకటన వచ్చిన తర్వాతే దీనిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. హోంబళే ఫిల్మ్స్‌కు భక్తి చిత్రాల విషయంలో ఇప్పటికే అనుభవం ఉంది. ఇటీవల హిందీ నుంచి వచ్చిన ‘మహావతార్ నరసింహ’ చిత్రాన్ని కూడా దక్షిణాది ప్రేక్షకులకు చేరువ చేయడంలో సంస్థ కీలకంగా వ్యవహరించింది. ఆ సినిమా కూడా పురాణ, భక్తి నేపథ్యంతో తెరకెక్కినదే కావడంతో.. ఇప్పుడు ‘హనుమాన్ అన్శ్’ విషయంలోనూ ఇదే సంస్థ పేరు వినిపించడం ఆసక్తిని పెంచుతోంది. ఒకవేళ హోంబళే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని అధికారికంగా తీసుకుంటే.. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేసే అవకాశాలు ఉండొచ్చనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే హిందీలో ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన దక్షిణాదిలోనూ సినిమాకు ఉపయోగపడుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# మీ ప్రేమతో పాటు.. ట్రోల్స్‌ను కూడా స్వీకరిస్తున్నా: నాని



నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘ది ప్యారడైజ్’. గురువారం (సెప్టెంబర్ 24న) విడుదలైన ఈ సినిమాకి మిక్స్‌డ్ టాక్ వచ్చింది. కొంతమంది సినిమా బాగుందని చెబుతుంటే.. కొంతమంది తమకు నచ్చలేదని అంటున్నారు. అయితే సినిమాపై వచ్చిన రివ్యూలపై నాని స్పందించారు. సినిమాపై చూపిస్తున్న ప్రేమ, విమర్శలు రెండింటినీ స్వాగతిస్తున్నానని అన్నారు. “ది ప్యారడైజ్‌పై అభిప్రాయాలు, స్పందన అన్నింటినీ చూశా. మీరు చూపించిన ప్రేమతో పాటు, సరదా ట్రోల్స్‌ను కూడా స్వీకరిస్తున్నా. దీనిని తమ సినిమాగా ప్రేక్షకులు స్వీకరించిన తీరు నా హృదయానికి హత్తుకుంది. అదే సమయంలో సినీ విమర్శకులు, రివ్యూవర్లు ఎత్తి చూపిన పొరపాట్లు, లోటుపాట్లను పరిగణనలోకి తీసుకుంటాను. మీ అందరికీ కృతజ్ఞతలు. మీకు ప్రత్యేకమైన అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో రక్తం, చెమట చిందించి #TheParadise తీర్చిదిద్దాం. మీరు దీన్ని సంబరంగా చేసుకోవచ్చు. విమర్శించవచ్చు. సినిమాపై మీరు చూపించిన ఉత్సాహం, నాపై కురిపించిన ప్రేమ, ఆప్యాయతకు నాలో కృతజ్ఞత భావాన్ని నింపాయి” అని నాని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.కాగా, భారీ అంచనాల నడుమ విడుదలైన ప్యారడైజ్ చిత్రం తొలిరోజు ప్రపంచవ్యాప్తంగా రూ.88 కోట్లు వసూళ్లు చేసినట్లు చిత్ర బృందం తెలిపింది. నాని కెరీర్‌లోనే ఇవి రికార్డుస్థాయి కలెక్షన్స్ అని వెల్లడించింది.

# సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసిన సూపర్ హిట్ సినిమా

కొన్ని సినిమాలు ఎటువంటి అంచనాలు లేకుండా విడుదలై.. సూపర్ హిట్‌గా నిలుస్తాయి. అలా వచ్చిన సినిమానే ఇమ్రాన్ హష్మి హీరోగా నటించిన ‘ఆవారాపన్-2’. 2007లో వచ్చిన ‘ఆవారాపన్’ సినిమాకి ఇది సీక్వెల్. మొదటి భాగం సినిమాని ప్రేక్షకులు థియేటర్లలో అంతగా పట్టించుకోలేదు. కానీ, ఆ తర్వాత టివిల్లో చూసి సినిమాని ఇష్టపడ్డారు. దీంతో ఆ సినిమా సీక్వెల్‌పై ఎన్నో అంచనాలు ఏర్పడ్డాయి. అనుకున్నట్లుగానే ‘ఆవారాపన్-2’ గత నెల 14న థియేటర్లలోకి వచ్చి బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. రూ.45 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా రూ.213 కోట్ల వసూళ్లు సాధించింది. అయితే ఇప్పుడు ఈ సినిమా సైలెంట్‌గా ఓటిటిలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్‌లో అద్దె విధానంలో అందుబాటులోకి వచ్చింది. త్వరలో ఉచితంగానూ స్ట్రీమింగ్‌లోకి రావచ్చు. హిందీలో మాత్రమే ఇది అందుబాటులో ఉంది.



# ‘అనుమాన పక్షి’ రివ్యూ.. విమల్ కృష్ణ టేకింగ్, రాగ్ మయూర్ నటన ఎలా ఉంది!




డిజె టిల్లు’ వంటి సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు విమల్ కృష్ణ తెరకెక్కించిన తాజా చిత్రం ‘అనుమాన పక్షి’. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా కథాకథనాలు ఎలా ఉన్నాయో సమీక్షలో చూద్దాం.కథేంటంటే: సన్నీ (రాగ్ మయూర్) ‘అనుమాన పక్షి’ పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ నడుపుతుంటాడు. ప్రతి విషయాన్ని అతిగా ఆలోచించడం, అందరినీ అనుమానించడం అతని నైజం. ఈ క్రమంలో తన స్నేహితుడు అనంతు డిప్రెషన్‌లో ఉన్నానని, కాశ్మీర్‌లో ఆత్మహత్య చేసుకుంటానని ఫోన్ చేస్తాడు. దాంతో సన్నీ, రమ్య అనే అమ్మాయిని ఇష్టపడే వర్మ (ప్రిన్స్) సహాయంతో కాశ్మీర్ బయలుదేరుతాడు. అక్కడ కన్య (మెరిన్ ఫిలిప్) పరిచయమవ్వడం, అనుకోకుండా వర్మ హత్యకు గురికావడం, రీల్స్ చేయడానికి పిచ్చిగా ప్రయత్నించే పోలీస్ ఆఫీసర్ వాసు (అజయ్) ఎంట్రీ ఇవ్వడం జరుగుతుంది. వీరందరి మధ్య సంబంధం ఏమిటి? ఈ చిక్కుముడిని సన్నీ ఎలా విప్పాడు? అనేదే ఈ చిత్ర అసలు కథ.విశ్లేషణ: దర్శకుడు విమల్ కృష్ణ ఎంచుకున్న పాయింట్ చాలా కొత్తగా ఉంది. ప్రతి చిన్న విషయానికి అనుమానపడే హీరో పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు విభిన్నంగా నవ్విస్తాయి. ప్రథమార్థంలో హీరో చేసే అల్లరి, సిచ్యుయేషనల్ కామెడీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఇక ద్వితీయార్థంలో అజయ్ పోలీస్ ఆఫీసర్‌గా చేసిన హంగామా, రీల్స్ కాన్సెప్ట్ ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా సరదాగా సాగుతాయి. స్క్రీన్‌ప్లేలో సస్పెన్స్ ఎలిమెంట్స్ సినిమాపై ఆసక్తిని కలిగిస్తాయి.నటీనటుల ప్రతిభ: లీడ్ రోల్ చేసిన రాగ్ మయూర్ తన అనుమానాలతో కూడిన పాత్రలో చాలా సహజంగా నటించాడు.